క్లుప్తంగా

భూతప్ప ఆలయంలో పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని హిరేతుర్పి గ్రామంలో వెలిసిన రాజబండ భూతప్ప దేవాలయాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, బెల్లం, కొబ్బరికాయలను స్వామివారికి సమర్పించారు. ఆయన వెంట సర్పంచ్ జీబీ కరుణాకర్, కరికెర శివన్న, నాయకులు జంపన్న, చిత్తయ్య, నరసింహమూర్తి, బండయ్య, దేవరాజు, తదితరులున్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు చేయండి



లీకవుతున్న నీటిని పరిశీలిస్తున్న డీఈ మనూనాయక్

లేపాక్షి: మండలంలోని గొంగటిపల్లి గ్రామంలో తాగునీటి పైపులు లీకేజీని గ్రామీణా నీటి సరఫరా విభాగం డీఈ మనూనాయక్ శనివారం ఉదయం పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజీతో గ్రామంలో ఉన్న నీటి కొళాయిలకు నీరు రాకపోవడంపై ఆరా తీశారు. పైపులైన్ లీకేజీతో నీళ్లు నిల్వ ఉండి సీజన్ వ్యాధులు వస్తాయని, లీకేజీలకు మరమ్మతు చేసి పరిశుభ్రమైన నీరు ప్రజలకు అందించాలని డీఈ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, కార్యదర్శి రమేష్, పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

పింఛన్ పంపిణీలో చిరిగిన నోట్లు



చిరిగిపోయిన రూ.500 నోట్లు

హిందూపురం: మండలం కిరికెర-1 సచివాలయ పరిధిలో పింఛన్ దారులకు అందించాల్సిన మొత్తంలో రూ.4 వేలకు సంబంధించిన చినిగిన నోట్లు వచ్చాయి. వివరాల్లోకెళితే.. సచివాలయ పంచాయతీ సెక్రటరీ ఇమ్రాన్ పింఛన్‌దారులకు నగదు పంపిణీ పూర్తిచేసి చనిపోయిన, అందుబాటులో లేని పింఛన్‌దారులకు సంబంధించిన మిగిలిన నగదును రూ.49 వేలను వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమాదేవికి అప్పగించారు. ఆమె హిందూపురంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ బ్యాంకులో ఆ మొత్తాన్ని బ్యాంకులో జమా చేయడానికి వెళ్లింది. బ్యాంకు అధికారులు నగదులో రూ.500 నోట్లు రూ.4 వేలు చిరిగినట్లు గుర్తించారు. ఆఖరికి అభ్యర్థన లేఖను వారు బ్యాంకు అధికారులకు అందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బోయ అనిల్ (34) మృతి చెందాడు. వివరాల్లోకెళితే... మునిమడుగుకు చెందిన అనిల్ రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనుల నిమిత్తం గుట్టూరుకు వెళ్లాడు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రం చనిపోయాడు. కియా పోలీసులు శనివారం ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని శవానికి పెనుకొండ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి తల్లి, భార్య నందిని ఉన్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

నాగేంద్రకు క్రైస్తవ సేవా రత్న అవార్డు



క్రైస్తవ సేవా రత్న అవార్డు అందుకుంటున్న నాగేంద్రకుమార్

హిందూపురం టౌన్: ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హిందూపురం పట్టణానికి చెందిన నాగేంద్రకుమార్ శనివారం క్రైస్తవ సేవా రత్న అవార్డును అందుకున్నారు. సికింద్రాబాద్‌లో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి, క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కృషి చేసిన వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేశారు. ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బ్రదర్ గద్దపాటి విజయరాజు, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పికట్ల జాకబ్ సామ్యూల్, నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్ కదారి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గిడియో చేతుల మీదుగా నాగేంద్రకుమార్‌కు క్రైస్తవ సేవా రత్న అవార్డు అందించారు.



ఆలూడి వద్ద వక్కతోటలో సాగు చేసిన కాగడ పూల తోట



పూలతోటకు డ్రిప్ ఏర్పాటు చేసిన దృశ్యం

కాగడాలతో కనక వర్షం

- మడకశిర నియోజకవర్గంలో 600 ఎకరాల్లో సాగు
- అగళినే 350 ఎకరాల్లో తోటలు
- ఎకరాకు రూ.4 లక్షల నుంచి 5 లక్షల లాభం
- పూలసాగుతో నష్టమే రాదంటున్న రైతులు

అగళి: అగళి మండలం పూలతోటలకు కేరాఫ్‌గా మారింది. గతంలో అధిక సంఖ్యలో రైతులు వేరుశనగ, ఇతర సాధారణ పంటలను ఎక్కువగా సాగుచేసేవారు. అయితే నాలుగేళ్లుగా ఎక్కువగా రైతులు వివిధ రకాల పూలతోటల పెంపకం చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. పూలతోటల పెంపకం లాభదాయకంగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు బోరు బావుల కింద వివిధ రకాల పూల తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. మడకశిర డివిజన్‌లో కాగడ, కనకాంబరం, మల్లెపూలు, గులాబీ తదితర పూల తోటలు 878 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఇందులో ఒక్క అగళి మండలంలోనే 350 ఎకరాల్లో పూలతోటలు సాగు చేస్తున్నారు. అందులోనూ కాగడా పూల సాగుకే అన్నదాతలు జై కొడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 600 ఎకరాల్లో కాగడ పూలను రైతులు సాగు చేస్తున్నారు.

ఐదేళ్ల పాటు ఆదాయం..

ఎకరా భూమిలో కాగడాల మొక్కలు నాటడంతో పాటు ఇతర ఖర్చులన్నీ కలిపి మొదటి సంవత్సరం రూ.50 వేల దాకా అవుతాయి. 9 నెలల తర్వాత నుంచి పూల కోత మొదలవుతుంది. కేవలం రెండు, మూడు నెలల కాలం మినహా సంవత్సరమంతా పూల దిగుబడి వస్తుంది. మొదటి సంవత్సరం రోజూ దాదాపుగా 15 నుంచి 20 కేజీల దిగుబడి వస్తాయి. రెండో సంవత్సరం నుంచి అయితే రోజూ 50 నుంచి 60 కేజీల వరకూ పూలనిస్తాయి. రెండో సంవత్సరం ఎరువులు, కలుపు నివారణ కోసం రూ.20 నుంచి రూ.30 వేల ఖర్చు వస్తుంది. సాధారణ రోజుల్లో కేజీ కాగడాలు రూ.300 నుంచి 400 వరకూ ధర పలుకుతాయి. అయితే పండుగల సమయంలో కేజీ ధర రూ.వెయ్యి నుంచి రూ.2వేల దాకా పలుకుతాయి. ఖర్చులన్నీ పోను కాగడాలను సాగు చేసిన రైతుకు ప్రతి ఏడాది రూ.4 నుంచి రూ.5 లక్షల ఆదాయం కచ్చితంగా ఉంటుంది.

అగళి టు మహారాష్ట్ర..

అగళిలో పండే కాగడా పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అగళి నుంచి కాగడ పూలు నిత్యం అనంతపురం, మహారాష్ట్రలోని కొల్లాపూర్, కర్ణాటకలోని దావణగెర, తుమకూరు, రాయచూర్, శిర మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. కాగడ పూల సాగులో ఇంత వరకూ ఎవరూ నష్టపోయిన దాఖలాలు కూడా లేవని రైతులు చెబుతున్నారు.



పూలను ప్యాకింగ్ చేస్తున్న వ్యాపారి

వేరుశనగతో నష్టపోయాం



గతంలో వేరుశనగ పంట సాగు చేసి వరుసగా నష్టాలు చవిచూశాం. అయితే గత ఐదేళ్లగా పూలతోటల సాగు చేసి ఆర్థికంగా ఎదుగుతున్నాం. బోరు బావి కింద మల్లెతోట, కాగడా పూలతోటలను సాగు చేశాను. ఎరువులు, ఇతరాత్ర వాటి కోసం రూ.50 వేలు వరకూ ఖర్చు పెట్టాను. ప్రస్తుతం మార్కెట్‌లో పూల ధర అధికంగా ఉండడంతో రూ.2 నుంచి రూ.2.50 లక్షల ఆదాయం పొందుతున్నాను. ప్రతి ఒక్కరూ పూలు సాగుచేస్తే ఆర్థికంగా ఎదగడానికి వీలుంటుంది.

– నరసింహరాజు, రైతు, ఆలూడి

ఆదాయం చాలా బాగుంది



బోరు బావి కింద గత 600 కాగడ పూల మొక్కలు సాగు చేసి లాభాలు పొందుతున్నాను. 300 మల్లె మొక్కలను రూ.40 వేల నుంచి 60 వేల వరకు ఖర్చు పెట్టి సాగు చేశాను. మార్కెట్‌లో కేజీ ధర రూ.400 ఉంటే ఖర్చులు పోనూ 9 నెలల్లో రూ.4 లక్షలు పైగా ఆదాయం వస్తుంది. అదే మార్కెట్‌లో కిలో పూలకు రూ.700, రూ.900 ధర ఉంటే రూ. 5 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. నాలుగేళ్లగా ఎప్పుడూ నష్టాన్ని మాత్రం చవిచూడలేదు.

– తిమ్మరాజు, రైతు, నరసబుంది

గ్రామస్థాయిలోనే ఉపాధి



కాగడపూల సీజన్ ప్రారంభం కావడంతో గ్రామస్థాయిలోనే ఉపాధి దొరుకుతోంది. పూలను విడిపించడాని కేజీకి రూ.100 ఇస్తారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దాదాపు మూడు కేజీల నుండి నాలుగు రేజీల వరకు విడిపిస్తాం. రోజుకు రూ.300 నుంచి రూ.400 దాకా ఉన్న ఊళ్లోనే సంపాదించుకుంటున్నా. మల్లెపూల సీజన్ తర్వాత కాకడ, కనకాంబర పూలు సీజన్ ప్రారంభం అవుతుంది. సంవత్సరంలో 10 నెలలు ఉపాధి గ్రామ స్థాయిలోనే దొరుకుతోంది.

– కాటమ్మ, కూలి, ఆలూడి

న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



న్యాయమూర్తి మన్మథరావును సన్మానిస్తున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి కె.మన్మథరావును శనివారం అనంతపురంలో స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది సిద్దు కలిసి హిందూపురం కోర్టుల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హిందూపురంలోని కోర్టుల్లో పూర్తిస్థాయిలో న్యాయమూర్తులను నియమించాలని కోరారు. త్వరలోనే ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేయండి

అమరాపురం: స్థానిక శిరా రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్‌లో సోమవారం ఉదయం 9గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కంటి శస్త్ర చికిత్సకు 40 మంది ఎంపిక

హిందూపురం టౌన్: పట్టణంలోని పాండురంగనగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కర్నూలు శాంతిరాం కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పాల్గొన్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. 40 మందిని కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు

రొళ్ల: 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని సమష్టి కృషితో గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేద్దాం. 2029లో మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందాం. నాయకులు, కార్యకర్తలకు అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది' అని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు భరోసా ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కేవలం 351 ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించారన్నారు. టీడీపీ పాలనతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను ఎన్నో రకాలుగా ఇబ్బందులుకు గురిచేస్తున్నారని తెలిపారు. కక్ష సాధింపు చర్యలు మానుకుని టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ తరుపున పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు ప్రసన్నకుమార్, దయానంద్, సంతోష్, తిప్పేస్వామి, దేవరాజు, శివన్న, మహంతేష్, రవికుమార్, సీఎం ఘట్ట రవి, యర్రగుంటప్ప, శ్రీరాయప్ప, కొండరాజు, కార్యకరులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలకు తరలిరండి

రొళ్ల: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మండల కేంద్రంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రొళ్ల మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

కష్టపడి కాదు ఇష్టపడి చదవండి



ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌బీఐ రిటైర్డ్ రీజినల్ డైరెక్టర్ నరసింహస్వామి

రొళ్ల: ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్‌బీఐ రిటైర్డ్ రీజినల్ డైరెక్టర్ ఎస్.ఎం.నరసింహస్వామి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో పెనుకొండ అడ్వకేట్ జె.ప్రతాప్‌రెడ్డి సహకారంతో మడకశిర ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంక్ మేనేజర్ దినేష్‌బాబు, సీబీఎం రవికుమార్ వారి సౌజన్యంతో రూ.1.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. నరసింహస్వామి, అడ్వకేట్ ప్రతాప్‌రెడ్డి, ఎంఈఓ శ్రీధర్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలకు అంతరాయం

పావగడ: తుంగభద్ర తాగునీటి విడుదలకు అంతరాయం ఏర్పడింది. చళ్లకెరెకు సుమారు 15 కి.మీ దూరంలో తుంగభద్ర జలాలు సరఫరా అయ్యే పైపు పగిలి పోవడంతో నీరు లీకేజీ అవుతోంది. దీంతో శనివారం పావగడకు చేరుకోవాల్సిన నీటికి అంతరాయం ఏర్పడింది. వెంటనే పైపులకు మరమ్మతు చేయించి రెండు మూడు రోజుల్లో తుంగభద్ర జలాలు పావగడకు వచ్చే విధంగా చూస్తామని నీటి పారుదలశాఖ బసవళింగప్ప తెలిపారు.



చిలమత్తూరులో కురుస్తున్న వర్షం

చిలమత్తూరులో భారీ వర్షం

చిలమత్తూరు: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో 39.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. ఖరీఫ్‌కు ఇంకా అవకాశం ఉండటంతో రైతులు పంటలు వేసుకునేందుకు సిద్ధమయ్యారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ మోస్తరు వర్షం కురిసినట్లు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. 23.2 మి.మీటర్ల వర్షం నమోదైందన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



హిందూపురం: జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించి ఐక్యత చాటుతున్న దృశ్యం



సోమందేపల్లి: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు



పెనుకొండ: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం కృషి చేసిన గొప్ప మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులు లోకేష్, క్రాంతి, తిమోతి, ఇమ్రాన్, శివ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పట్టణంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, దళిత నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మల్లికార్జున నివాళులర్పించారు.

సోమందేపల్లి: స్వాతంత్ర్య సమర యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని శనివారం దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు నరసింహమూర్తి, ఈశ్వర్, కిష్టప్ప, సూరి, గంగాధర్, కదిరప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పెనుకొండ పట్టణంలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో శనివారం భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాంప్లెక్స్ భవనంలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయమూర్తి శివ రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పరిరక్షణ, జాతి సమైక్యతకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. నాయకులు వెంకటేసులు, బాబు, రవి, నరసింహులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన హిందూపురం పాస్టర్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు

హిందూపురం: హిందూపురం పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నుకున్నట్లు పాస్టర్ ఫెలోషిప్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.డేవిడ్ తెలియజేశారు. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా ఎస్.డేవిడ్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.యేసురత్నం, సెక్రెటరీగా జయరాజ్, జాయింట్ సెక్రటరీగా హేమాద్రి, కోశాధికారిగా పాస్టర్ విజయ్ కుమార్, ఉప కోశాధికారి పాస్టర్‌గా జే.జేమ్స్, కమిటీ సభ్యులుగా కృపాసత్యరాజ్, జాన్, లుకా బాబు, విలేజ్ కన్వీనర్‌గా అబ్రహం, సలహాదారులుగా డాక్టర్ ఎస్.డేవిడ్ రాజ్, బేబీ అబ్రాహాం, పి.జయరాజ్, హనోక్ బాబులను ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

పాఠశాలలో తాగునీటి సమస్య

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ సమస్యతో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడినట్లు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తెలిపారు. విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. విద్యార్థులు ఇబ్బందిపడకుండా శనివారం ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయించుకున్నామన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించి పాఠశాలలో తాగునీటి సమస్యను తీర్చాలన్నారు.

కూలీలకు గాయాలు

పావగడ: నియోజకవర్గ పరిధిలోని అరసికెర పోలీసుస్టేషన్ పరిధిలో అరసికెర గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడటంతో ఏడుగురు కూలీలు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి కూలీ పనులు ముగించుకొని అరసికెర గ్రామానికి ఆటోలు కూలీలు బయలు దేరారు. అయితే అరసికెర సమీపంలో ఆటోలో బోల్తా పడటంతో ఏడుగురు గాయపడగా అందులో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని తుమకూరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధారాసింగ్ తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని 544ఈ జాతీయ రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను శనివారం రాత్రి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మడకశిర ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ వారు రూ.1.40 లక్షల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం రికార్డుల తనిఖీ చేసి విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

పెనుకొండ: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మహిళకు గాయాలు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో తుమ్మలకుంటకు చెందిన అలివేలమ్మకు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. భర్తతో కలసి ఆమె రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వాహనం ఢీకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వెంటనే ఆమెను చిలమత్తూరు పీహెచ్‌సీకి తరలించారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ భాస్కర్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యా ప్రగతి, విద్యార్థుల సంఖ్య, భోజన పథకం అమలు తీరు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు.